- ‘డబుల్ ఇండ్ల’కు ట్యాంకరే దిక్కు!

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం రాంపూర్‌లో డబుల్ బెడ్ రూం ఇండ్ల కాలనీలో తాగునీటి సమస్య వేధిస్తున్నది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తే రోడ్డు నిర్మాణంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసం కావడంతో నీటి సరఫరా నిలిచిపోయిందంటూ సమాధానమిస్తున్నారు. దీంతో పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. –కోటగిరి

- పాలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గోరంటాల శివారులో శుక్రవారం కామారెడ్డి ఆర్టీసీ డిపో బస్సు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది ప్రయాణికులకు గాయాలు కావడంతో సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించారు. ఘటనా స్థలాన్ని డిపో మేనేజర్ ఇందిర పరిశీలించారు. –గంభీరావుపేట

గుడిపేటలో పంచాయతీ కార్యాలయానికి వచ్చి నిరసన తెలుపుతున్న మహిళలు

గుడిపేటను కార్పొరేషన్‌లో కలపొద్దు

మంచిర్యాల, జనవరి 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో తమ గ్రామ పంచాయతీని విలీనం చేయొద్దని గుడిపేటకు చెందిన ఉపాధి హామీ కూలీలు డిమాండ్ చేశారు. మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మారుస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. మంచిర్యాలతోపాటు నస్పూర్ మున్సిపాలిటీ, హాజీపూర్ మండలం పోచంపాడ్, గుడిపేట, నర్సింగాపూర్, నంనూర్, చందనాపూర్, ముల్కల, కొత్తపల్లి, వేంపల్లి పంచాయతీలను కార్పొరేషన్‌లో విలీనంచేసింది. కాగా గుడిపేట ఉపాధిహామీ కూలీలు తమ పంచాయతీని కార్పొరేషన్‌లో కలపొద్దంటూ శుక్రవారం పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు కలిపి వినతిపత్రాలు ఇస్తామన్నారు. అప్పటికీ వారు స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.

గురుకుల విద్యార్థులను చితకబాదిన ప్రిన్సిపాల్

- అల్లరి చేశారంటూ.. గదిలో బంధించి దాడి
- నల్లగొండ మైనార్టీ గురుకులంలో ఘటన
- పాఠశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

ఉపాధ్యాయులను నిలదీస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఉపాధ్యాయులు కొట్టడంతో విద్యార్థి తొడపై కమిలిన దృశ్యం

రామగిరి, జనవరి 31: పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన ఉపాధ్యాయులు కర్కశత్వంతో వారిని గదిలో బంధించి చితకబాదిన ఘటన నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఎస్ఎల్‌బీసీ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం వెలుగు చూసింది. పాఠశాల గోడలమీద రాతలు రాశారంటూ 7వ తరగతికి చెందిన 10 మంది విద్యార్థులను ఈ నెల 28న గదిలో బంధించి ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు జ్యోతిబసు, బాబా వైర్లు, కర్రలతో చితకబాదారు. శుక్రవారం తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి చూడగా ఓ పిల్లవాడి ఒంటిపై వాతలు, రక్తం వచ్చినట్లు గాట్లు ఉండడంతో ఏమి జరిగిందని ఆరాతీశారు. దాంతో తమను ఉపాధ్యాయులు కొట్టినట్టు సదరు విద్యార్థి తల్లిదండ్రులకు చెప్పడంతో విషయం బయటకు వచ్చింది. ఇదే విషయమై విద్యారుల తల్లిదండ్రులు పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను ప్రశ్నించగా వారు విద్యార్థులు గోడలపై రాతలు రాయడంతో క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగగా ఉపాధ్యాయులు క్షమాపణ చెప్పడంతో పాటు మళ్లీ ఇలాంటి ఘటన జరుగకుండా చూస్తామని బతిమిలాడారు.దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చేయిచేయి కలిపి.. పూడికతీత చేపట్టి!

- నీటి నిల్వ పెంచేందుకు ముందుకొచ్చిన రైతులు

అయిజ, జనవరి 31 : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం బింగిదొడ్డి చెరువులో నీటి నిల్వలు పెంచేందుకు రైతులు ముందుకొచ్చారు. తాటికుంట రిజర్వాయర్ నుంచి బింగిదొడ్డి చెరువుకు నీరొచ్చేందుకు తూము ఉన్నా కాల్వ పూర్తికాకపోవడంతో నీటి చేరిక ఆలస్యమవుతున్నది. ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో మత్స్య సహకార సంఘంతో కలిసి 15 మంది కర్షకులు స్వచ్ఛందంగా కదిలారు. నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలోని తాటికుంట రిజర్వాయర్ నుంచి బింగిదొడ్డి చెరువు వరకు నీటిని పారించేందుకు 3 కిలోమీటర్ల డీ-1 కాల్వలో పూడికతీత తొలగింపు పనులు శుక్రవారం చేపట్టారు. ముళ్లపొదల తొలగింపు పనులకు రూ.3 లక్షల వరకు ఖర్చు కావచ్చని, సొంతంగా డబ్బులు వేసుకొని పనులు చేపడుతున్నట్టు రైతులు తెలిపారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లోని డీఎంహెచ్ఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పీవైఎల్, పీవోడబ్ల్యూ నాయకులు

దవాఖానల్లో ఫీజుల దోపిడీని అరికట్టండి

కొత్తగూడెం గణేష్ టెంపుల్, జనవరి 31 : ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలని, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ పీవైఎల్, పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకులు చంద్ర అరుణ, వాంకుడోతు అజయ్‌లు మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్యం అందకపోవడంతో నిరుపేదలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని, దీనిని ఆసరా చేసుకుని ఫీజుల పేరిట దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. వివిధ రకాల టెస్టులు, మందుల పేరుతో లక్షల బిల్లులు వేస్తున్నారని మండిపడ్డారు. పై సమస్యలు పరిష్కరించని పక్షంలో తమ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బుచ్చిరాజు, సావిత్రి, కెచ్చల కల్పన, ధరావత్ దేవా, కొర్స రామకృష్ణ, పూనెం మంగయ్య, లక్ష్మణరావు, దుర్గ, నూపా సరోజిని, కల్లూరి పద్మ పాల్గొన్నారు.

సీఐపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలి

- జమ్మికుంట సీఐ బాధితుల డిమాండ్

హుజూరాబాద్, జనవరి 31: కరీంనగర్ జిల్లా జమ్మికుంట సీఐ వరగంటి రవిపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని సామాజిక కార్యకర్త షేక్ షాబీర్ అలీ, దళిత సంఘం నాయకుడు అంబాల రాజు, సీఐ బాధితులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు జమ్మికుంటలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. కాటేపల్లి లక్ష్మి అనే వృద్ధురాలు మాట్లాడుతూ తనకు సంబంధించిన భూమిని ఏనుగు జయపాల్‌రెడ్డి ఆక్రమించుకోవాలని చూస్తున్నాడని సీఐకి పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఆర్డీవో నిర్లక్ష్యంతో తనకు అన్యాయం జరిగిందని వాపోయింది. కాటిపల్లి సంధ్యారాణి మాట్లాడుతూ సీఐ అరాచకాల మూలంగా తాను కట్టుబట్టల్లో మూత్రం పోసుకోవాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. సీఐ అరాచకాలతో పాటు అతడిని కాపాడుతున్న ఏసీపీపై కూడా క్షేత్రస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

వీర్ల నర్సవ్వ | ఆది రాజవ్వ

మహా కుంభమేళాకు వెళ్లి ..

తప్పిపోయిన జగిత్యాలవాసులు

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 31 : మహాకుంభమేళాలో జగిత్యాలకు చెందిన ఇద్దరు మహిళలు తప్పిపోయారు. బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లాకేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన వీర్ల నర్సవ్వ (56), కొత్తవాడకు చెందిన ఆది రాజవ్వ (55)తోపాటు పట్టణానికి చెందిన మరో ఎనిమిది మంది, కడెంకు చెందిన మరో ఇద్దరు మహిళలు కలిసి జనవరి 27న ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళాకు వెళ్లారు. 28న అక్కడికి చేరుకున్నారు. అదే రోజు రాత్రి వీర్ల నర్సవ్వ, ఆది రాజవ్వ తప్పిపోయినట్టు వీరితో వెళ్లిన మహిళలు జగిత్యాలలోని బంధువులకు సమాచారం అందించారు. ఆచూకీ కనిపెట్టేందుకు బంధువులు ప్రయాగ్‌రాజ్‌కు బయలుదేరినట్టు తెలిసింది.

ఆదిలాబాద్ అడవుల్లో అరుదైన హైనా

హైదరాబాద్/ ఆదిలాబాద్, జనవరి 31(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో అరుదైన హైనా కెమెరాకు చిక్కింది. ఈ నెల 28 మావల మండలం అర్బన్ ఫారెస్ట్‌లో అటవీశాఖ అధికారులు ఏర్పాటుచేసిన సోలార్ సిస్టం సీసీ కెమెరాలో హైనా తిరుగుతున్న దృశ్యాలు రికార్డయ్యాయి. దేశంలోనే అరుదైన చారల హైనా ఆదిలాబాద్ అడవుల్లో సీసీ కెమెరాకు చిక్కడం అడవులు, వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యల ఫలితమేనని అటవీ అధికారులు తెలిపారు. ఎఫ్ఆర్‌వో గులాబ్‌సింగ్ మాట్లాడుతూ.. ఎప్పుడో కొన్నేండ్ల క్రితం కనిపించకుండా పోయిన హైనాలు తిరిగి మావల హరితవనంలో కనిపించడం సంతోషంగా ఉందన్నారు.

ఏడుగురు మావోయిస్టుల లొంగుబాటు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జనవరి 31 : మావోయిస్టుల ఆపరేషన్స్‌లో క్రియాశీలకంగా పాల్గొన్న ఏడుగురు మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ జిల్లా పోలీస్ అధికారుల ఎదుట లొంగిపోయారు. శుక్రవారం పోలీసులు మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. లొంగిపోయిన వారిలో డీవీసీఎం మమతతోపాటు ముగ్గురు మావోయిస్టుల్లో ఒక్కొక్కరిపై రూ.8 లక్షలు, ఒక సభ్యుడిపై రూ.5 లక్షలు, మిగతా ఒక్కొక్కరిపై రూ.లక్ష చొప్పున రివార్డులు ఉన్నట్టు పేర్కొన్నారు.

లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న కాంకేర్ జిల్లా పోలీస్ అధికారులు

రికార్డులు పరిశీలిస్తున్న ఝాన్సీ లక్ష్మీబాయి

సఖీ సేవలపై విస్తృత ప్రచారం చేయాలి

పోచమ్మమైదాన్, జనవరి 31: వరంగల్‌లోని సఖీ సెంటర్‌ను మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ జిల్లా రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి శుక్రవారం సందర్శించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెంటర్‌ను ఆమె పరిశీలించారు. గత ఐదేళ్ల నుంచి సఖీ సెంటర్‌లో నమోదైన కేసుల వివరాలు, కోర్టులో మెయింటెనెన్స్ కోసం ఫైల్ చేసిన కేసుల స్టేటస్‌తోపాటు అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించిన రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. సఖీ సేవలపై విస్తృత ప్రచారం చేయాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం సఖీ సెంటర్ సేవలు, మహిళా హెల్ప్‌లైన్‌కు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఆర్గనైజేషన్ సెక్రటరీ డాక్టర్ పల్లెపాడు దామోదర్, సఖీ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ వల్లె శ్రీలత, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు

మాతా శిశు మరణాల రేటు తగ్గించాలి

వరంగల్‌చౌరస్తా, జనవరి 31: మహిళకు మరో జన్మగా భావించే ప్రసవ సమయంలో సంభవిస్తున్న మరణాల రేటును తగ్గించేందుకు ప్రతి ఆరోగ్య కార్యకర్త కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు అన్నారు. జిల్లా కార్యాలయంలో శుక్రవారం జాతీయ ఆరోగ్య మిషన్, అర్మాన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆరోగ్య కార్యకర్తలకు ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ గర్భిణిగా గుర్తించిన నాటి నుంచి ప్రసవమయ్యే వరకూ రోజూ ఆరోగ్య స్థితిగతులను పర్యవేక్షించాలన్నారు. అధిక రక్తపోటు, మధుమేహం, క్షయ, రక్తహీనత, అధిక బరువు, మానసిక సమస్యలను గుర్తిస్తే ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించొచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సంతోషిణి, డాక్టర్ స్రవంతి, అర్మాన్ సంస్థ ప్రతినిధులు డాక్టర్ అర్చన, మాతాశిశు సంరక్షణ అధికారి మనోజ, నాగరాజు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

బేటీ బచావో.. బేటీ పడావోపై అవగాహన

గిర్మాజీపేట, జనవరి 31: బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమం పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా మహిళా సాధికారత ఆధ్వర్యంలో శుక్రవారం లక్ష్మీపురంలోని ఉన్నత పాఠశాల విద్యార్థినులకు జిల్లా జెండర్ స్పెషలిస్ట్ ఆర్ రమాదేవి అవగాహన కల్పించారు. విద్యార్థినులు మొబైల్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. బాల్య వివాహాల నిషేధ చట్టం, బాలల అక్రమ రవాణా, బాలల హక్కులు, ఫోక్సో చట్టం, హెల్ప్‌లైన్ నంబర్లు 100, 1098, 181, 14567, 155326, 108, 1930పై వివరించారు. హెచ్ఎం లక్ష్మయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న రమాదేవి

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- తక్కువ పెట్టుబడితో వ్యాపారాలు ప్రారంభించాలి
- ఎక్కువ లాభాలు గడించేలా కృషి చేయాలి
- అదనపు కలెక్టర్ సంధ్యారాణి

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

నర్సంపేట, జనవరి 31: స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రభుత్వ పథకాలను వినియోగించుకొని ఆర్థికాభివృద్ధి సాధించాని అదనపు కలెక్టర్ సంధ్యారాణి సూచించారు. శుక్రవారం పట్టణంలోని శాంతి సమాఖ్య భవనంలో అధ్యక్షురాలు ముస్కు నీరజ అధ్యక్షతన టీఎల్ఎఫ్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సంధ్యారాణి హాజరై మాట్లాడారు. మహిళలు సొంతంగా వ్యాపారాలు ప్రారంభించుకొని వ్యాపారవేత్తలుగా ఎదగాలని సూచించారు. ఒకేరకమైన వ్యాపారం కాకుండా కొత్తగా ఆలోచించాలన్నారు. ఈ ప్రాంతంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే వ్యాపారాలు చేయాలన్నారు. ప్రజల అభిరుచికి అనుగుణంగా వ్యాపారంలో మెళకువలు నేర్చుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్లు, టీస్టాల్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. హోంపుడ్ ద్వారా పెట్టుబడి కంటే లాభాలు అధికంగా వస్తాయని, సమాఖ్యలు బ్యాంక్ లింకేజీ, వ్యక్తిగత రుణాలను సభ్యులకు ఇప్పించి, వారిని వ్యాపారంలో ప్రోత్సహించి నెలనెలా కిస్తీలు సక్రమంగా కట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో మెప్మా పీడీ రాంచందర్‌రావు, డీఎంసీ రేణుక, ఏడీఎంసీ ఎస్‌కే వహీదా, స్త్రీనిధి మేనేజర్ ఫిర్దోస్, శాంతి పట్టణ సమాఖ్య కార్యదర్శి హసీనా, కోశాధికారి పద్మ, టీఎల్ఎఫ్ ఆర్పీ మాధవి, సీఎల్ఆర్పీ సుమలత పాల్గొన్నారు. అలాగే, అదనపు కలెక్టర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. వచ్చే వేసవిలో నర్సంపేట పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అన్ని వార్డుల్లో పన్నులు వందశాతం వసూలు చేయాలని ఆదేశించారు. ఆమె వెంట మున్సిపల్ ఐసీ మేనేజర్ టి.సంపత్, ఏఈ కే రాజేశ్, జూనియర్ అసిస్టెంట్ కే కిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.నాగరాజు పాల్గొన్నారు.

‘టీచర్లపై చర్యలు తీసుకోవాలి’

నల్లబెల్లి: సమయపాలన పాటించని ప్రభుత్వ ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ సంధ్యారాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ మాట్లాడుతూ మండలంలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లు సమయపాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నారని ఆరోపించారు. దీనివల్ల విద్యార్థుల భవిష్యత్ ఆగమ్యగోచరంగా తయారైందన్నారు. కొందరు ఉపాధ్యాయులు తాము యూనియన్ లీడర్లమని చెప్పుకుంటూ పాఠశాలలకు డుమ్మా కొట్టడం, మరికొందరు ఇన్సూరెన్స్ ఏజెంట్లుగా, ఇంకొందరు చీటీల వ్యాపారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. దీంతో పాఠశాలలకు రాకుండా ఉపాధ్యాయులు రొటేషన్ పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ఇలాంటి టీచర్లపై చర్యలు తీసుకోవాలని ఎంఈవోకు వినతిపత్రాలు ఇచ్చినా వారికే వంత పాడుతున్నారని ఆరోపించారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఏబీఎస్ఎఫ్ నాయకుడు శనిగరపు రాజేందర్ ఉన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఉద్యమకారులు

ఘనంగా గద్దర్ జయంతి వేడుకలు

నల్లబెల్లి/సంగెం/పోచమ్మమైదాన్, జనవరి 31: అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం అనునిత్యం పోరాడిన గద్దర్ ప్రజల గొంతుక అయ్యారని తెలంగాణ ఉద్యమకారుల డివిజన్ అధ్యక్షుడు గూబ రాజు అన్నారు. గద్దర్ జయంతిని మండలకేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం జిల్లా కార్యదర్శి భట్టు సాంబయ్య, శిరీష, ఐలయ్య, హేమంత్, సుధాకర్, బాలరాజు, మధుక, వైద్యాధికారి ఆచార్య పాల్గొన్నారు. అలాగే, గద్దర్ జయంతి సందర్భంగా సంగెం మండలకేంద్రంలో కళాకారులు మెట్టుపల్లి రమేశ్, బొమ్మెర రవి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. ఆగపాటి రాజు, పులి సాంబయ్య, రామకృష్ణ, బాబు, అనిరుద్, రవి, చేరాలు, రాజీవ్, నాల్లం రాములు పాల్గొన్నారు. అలాగే, జేబీ కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ జడల శివ ఆధ్వర్యంలో వరంగల్ కొత్తవాడ గోపాలస్వామి గుడి సెంటర్‌లో గద్దర్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో రోజా క్రియేషన్ అధ్యక్షుడు ఆలేటి శ్యామ్, గాయకుడు రాము, సకల కళా సాంస్కృతిక మండలి అధ్యక్షుడు గడ్డం సుధాకర్, హంసలేక మధుసూదన్, గజ్జి దినకర్, సిరబోయిన రాజు, రమేశ్, బస్వరాజు రమేశ్, కట్టమల్లు పాల్గొన్నారు.

బీసీ యుద్ధ భేరిని జయప్రదం చేయాలి

రాయపర్తి/ఖిలావరంగల్/నెక్కొండ/దుగ్గొండి/సంగెం/వరంగల్‌చౌరస్తా, జనవరి 31: హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించనున్న బీసీ రాజకీయ యుద్ధ భేరి సభకు మండలంలోని ముదిరాజ్‌లు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ముదిరాజ్ మహాసభ మండలాధ్యక్షుడు ముద్రబోయిన వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ మేరకు ముదిరాజ్ మహాసభ సారథ్యంలో ముద్రించిన హలో ముదిరాజ్-చలో వరంగల్ ప్రచార పోస్టర్లను సంఘం ప్రతినిధులతో కలిసి శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ ప్రతినిధులు నర్సింహులు రమేశ్, కనుకుట్ల యాకయ్య, సోడెపు ఉప్పలయ్య, కుక్కల సురేశ్, బాద రవి, యాకయ్య, సంతోష్ పాల్గొన్నారు. అలాగే, ఖిలావరంగల్ ముదిరాజ్ భవనంలో వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం వరంగల్ అధ్యక్షుడు బయ్య స్వామి, బిల్లా శివ, కూరాకుల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి రావుల రాజేశ్, బోళ్ల పెద్ద సారంగపాణి, గీకురు సారంగపాణి, కుమారస్వామి, శ్రీనివాస్, చంద్రశేఖర్, సురేశ్, కృష్ణకాంత్ పాల్గొన్నారు. అలాగే, బీసీ రాజకీయ యుద్ధ బేరి బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్లను నెక్కొండలో గౌడ సంఘం ప్రతినిధి కారింగుల సురేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రతినిధులు ఆవిష్కరించారు. దుగ్గొండి మండలకేంద్రంలో యుద్ధ భేరి వాల్ పోస్టర్లను మోకు దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మోకు దెబ్బ నాయకులు బూర హేమచంద్, కక్కెర్ల సాంబయ్య, గైని మొగిలి, కామిశెట్టి ప్రశాంత్, బూర్గు బుచ్చయ్య, అశోక్, రాజు, మెహన్, కోటన్న, కిశోర్ పాల్గొన్నారు. సంగెంలో యుద్ధభేరి పోస్టర్లను బీసీ నాయకులు ఆవిష్కరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు వేల్పుల కుమారస్వామి, గూడ సుదర్శన్‌రెడ్డి, కోడూరి సదయ్య, కిశోర్ యాదవ్, పులి వీరస్వామిగౌడ్, వెంకట్‌గౌడ్, రాజయ్యయాదవ్, మునుకుంట్ల మోహన్, గజ్జెల శ్రీనివాస్, వాసం సాంబయ్య పాల్గొన్నారు. ఆదివారం హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో జరగనున్న బీసీల రాజకీయ యుద్ధభేరి సభకు హాజరు కావాలని ప్రముఖులకు ఆహ్వాన పత్రాలు అందజేశారు. ఆహ్వాన కమిటీ ప్రతినిధులు మందల పరశురాములు, ధర్మపురి రాజగోవిందు తెలంగాణ శాసన మండలి ఉప సభాపతి డాక్టర్ బండా ప్రకాశ్, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, బోగు రామన్న, తెలంగాణ శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే రాజలింగం, మున్సిపల్ మాజీ చైర్మన్ జంగాం రాములు, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, గెల్లు శ్రీనివాస్, రాజ్యసభ మాజీ సభ్యుడు రాపోలు ఆనంద్‌భాస్కర్‌ను కలిశారు.

రాయపర్తిలో వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి

వరంగల్ చౌరస్తా, జనవరి 31: కేంద్ర ప్రభుత్వం కార్మికుల జీవితాలను అంధకారంలోకి నెట్టేందుకు రూపొందించిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఓంకార్ భవన్‌లో శుక్రవారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సాగర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామస్వామి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గన్నారపు రమేశ్, ఏఐసీటీయూ రాష్ట్ర నాయకుడు నర్ర ప్రతాప్, జిల్లా కార్యదర్శి సుంచు జగదీశ్వర్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ పాల్గొని మాట్లాడారు. లేబర్ కోడ్‌లను ఉపసంహరించి కేంద్రం రానున్న బడ్జెట్ సమావేశాల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ దేశవ్యాప్తంగా ఈ నెల 5న జిల్లాకేంద్రాల్లో ఆందోళనలు చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో అంకటి శ్యామ్, సుధాకర్, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పన శాఖ జిల్లా ఇన్‌చార్జిగా మల్లయ్య

కరీమాబాద్, జనవరి31: ఉపాధి కల్పన శాఖ వరంగల్ జిల్లా ఇన్‌చార్జిగా మల్లయ్యకు అదనపు బాధ్యతలు అప్పగించారు. జిల్లా అధికారి ఉమారాణి శుక్రవారం ఉద్యోగ విరమణ చేయడంతో హనుమకొండ జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారిగా కొనసాగుతున్న మల్లయ్యకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టిన ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- మామునూరు ఏసీపీ తిరుపతి
- పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీ